జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
ఆదివారం 22 02 2026
సంపుటి 1 సంచిక 92
పేజీలు : 04
PRGI No : TGTEL/25/A4195

SUNRAYS POLY CLINIC & DIAGNOSTIC CENTER

DR.MAJOR NAVEEN KUMAR CHINTHA
MBBS,MD, FICCM (Retd)
Reg No: 84124
General and Family Physician
▷ Treatment for All General Ailments
▷ Diabetes, BP, Fever, Asthma
▷ Chronic Disease Management
అన్ని రకాల దీర్ఘ కాలిక వ్యాధులు చూడబడును

DR. K. PRASANNA LATHA
MBBS, MS (OBG)
Specialist in Women & Child Health Infertility Specialist
▷ Pregnancy Care - Normal & C-Section Deliveries
▷ Infertility Treatment
▷ Women's Health Care
స్త్రీల అన్ని రకాల వైద్య సదుపాయం కలదు

Timings : 5:00 PM to 9:00 PM
9248924831
LAB ECG DIGITAL X-RAY PHARMACY AVAILABLE
HOME SAMPLE COLLECTION AVAILABLE
#1-92/1, Kuntloor, Abdullapurmet (M), Hayath Nagar, R.R.Dist.

# పరిషత్‌లు రద్దు దిశగా అడుగులు

**స్థానిక సంస్థల పరిపాలనా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసే దిశగా ప్రభుత్వం**

**ప్రభుత్వ ఖజానాపై భారాన్ని తగ్గించమే.. రేపటి కేబినెట్ భేటీలో ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశం**




**దశ, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలోని స్థానిక సంస్థల పరిపాలనా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసే దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత కీలకమైన అడుగులు వేస్తోంది. రాష్ట్రంలోని ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థలను పూర్తిగా రద్దు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ఒక వేళ ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే, తెలంగాణ రాజకీయాల్లో ఇది ఒక పెను సంచలనంగా మారొచ్చు. తెలంగాణలో ప్రస్తుతం అమల్లో ఉన్న మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థలో ఎంపీటీసీ, జడ్పీటీసీల పాత్రపై ప్రభుత్వం సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించింది. ఈ వ్యవస్థ రద్దు చేయాలనే ఆలోచన వెనుక మూడు బలమైన కారణాలు కనిపిస్తున్నాయి. ఈ వ్యవస్థ ద్వారా ప్రజల చేత ఎన్నికైన ప్రతినిధులకు క్షేత్రస్థాయిలో సరైన అధికారులు కానీ, నిర్దిష్టమైన బాధ్యతలు కానీ లేవని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. కేవలం పదవులు ఉండి, నిధులు, విధులు లేకపోవడం వల్ల ఆశించిన అభివృద్ధి జరగడం లేదని సర్కారు భావిస్తోంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థలను రద్దు చేయడం ద్వారా భవిష్యత్‌లో ఈ స్థానాలకు ప్రత్యేకంగా ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరమే ఉండదని ప్రభుత్వం యోచిస్తోంది. ఇది ప్రభుత్వ ఖజానాపై భారాన్ని తగ్గించమే కాకుండా తరచూ వచ్చే ఎన్నికల కోడ్ అడ్డంకులను కూడా నివారిస్తుందని అంటున్నారు. ప్రస్తుతం వ్యవస్థల వల్ల పాలనాపరంగా పెద్దగా ఉపయోగం లేదని ప్రభుత్వం ప్రాథమికంగా ఒక నిర్ధారణకు వచ్చినట్టు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనపై స్పష్టత రావడానికి ఫిబ్రవరి 23న జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశం అత్యంత కీలకమైంది. ఈ సమావేంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థల రద్దుపై ప్రభుత్వం చర్చించే ఛాన్స్ ఉంది. ఈ లోగా ఈ అంశంపై ఒక సమగ్ర నివేదికను సమర్పించాలని రేవంత్ ప్రభుత్వం పంచాయతీ రాజ్ శాఖను ఆదేశించింది. ఈ నివేదికలో

..మిగతా 2వ పేజీలో →

# ఎమ్మెల్యేలనూ కూడగడుతున్నారా.?

**మాటలకే పరిమితం కాకుండా,**
**తెరవెనుక పావులు కదుపుతున్నారనే ప్రచారం.**
**గతంలో కూడా పార్టీని వీడి మళ్ళీ తిరిగి వచ్చిన సందర్భాలు .**
**మళ్ళీ అదే బాట పడతారా.?**
**ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వైఖరి పార్టీకి బలమా లేక బలహీనతా.!**



**దశ, హైదరాబాద్:** తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. మంత్రి పదవి ఆశించిన ఆయన, అది దక్కకపోవడంతో తన అసంతృప్తిని బాహాటంగానే వెళ్లగక్కుతున్నారు. కేవలం అసంతృప్తి వ్యక్తం చేయడమే కాకుండా, ఒకానొక దశలో ఏకంగా ముఖ్యమంత్రి పదవినే సవాల్ చేసే స్థాయికి ఆయన వ్యాఖ్యలు వెళ్లడం రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. మంత్రి పదవి ఇవ్వకుంటే తానేంటో చూపిస్తానన్నట్లుగా ఆయన చేస్తున్న హెచ్చరికలు పార్టీలో అంతర్గత పోరును వీధికెక్కించాయి.రాజగోపాల్ రెడ్డి కేవలం మాటలకే పరిమితం కాకుండా, తెరవెనుక పావులు కదుపుతున్నారనే ప్రచారం కాంగ్రెస్ శ్రేణుల్లో ఆందోళన కలిగిస్తోంది. తనకు అనుకూలంగా ఉన్న కొంతమంది ఎమ్మెల్యేలతో ఆయన నిరంతరం చర్చలు జరుపుతున్నారని, అవసరమైతే ఒక వర్గంగా విడిపోయే యోచనలో ఉన్నారని జోరుగా చర్చ సాగుతోంది. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి తన డిమాండ్లను నెరవేర్చుకోవడమే లక్ష్యంగా ఆయన ఈ వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ ఆయన చేస్తున్న విమర్శలు పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించేలా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి రాజగోపాల్ రెడ్డి దూకుడుగా వ్యవహరిస్తున్నా, అధిష్టానం ఇప్పటివరకు చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. అయితే, ఇప్పుడు పరిస్థితి చేతులు దాటిపోతోందని, ఆయన ఏకంగా ప్రభుత్వాన్ని బలహీనం చేసే దిశగా అడుగులు వేస్తున్నారని సంకేతాలు అందడంతో హైకమాండ్ అప్రమత్తమైంది. ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలు ఈ వ్యవహారాన్ని ఇప్పటికే కేంద్ర పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే సహించేది లేదని అధిష్టానం స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

ఈ క్రమంలోనే పీసీసీ చీఫ్ చేసిన ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. రాజగోపాల్ రెడ్డిని పిలిపించి మాట్లాడతామని, ఆయన అభ్యంతరాలు ఏమిటో తెలుసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఇది ఒక రకంగా రాజగోపాల్ రెడ్డికి ఇస్తున్న చివరి హెచ్చరికగా భావించవచ్చు. సర్దిచెప్పే ప్రయత్నాలు విఫలమైతే, పార్టీ లైన్ దాటి వెళ్తున్న నేతపై కఠిన చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడబోమనే సంకేతాన్ని పీసీసీ పంపింది. రాజగోపాల్ రెడ్డిని దారికి తెచ్చేందుకు అధిష్టానం త్వరలోనే ఒక స్పష్టమైన కార్యాచరణతో ముందుకు రానుంది.రాజగోపాల్ రెడ్డి గతాన్ని పరిశీలిస్తే, ఆయన గతంలో కూడా పార్టీని వీడి మళ్ళీ తిరిగి వచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు ఆయన మళ్ళీ అదే బాట పడతారా లేక మంత్రి పదవి కోసం ఒత్తిడి తంత్రం మాత్రమే ఉపయోగిస్తున్నారా అనేది తేలాల్సి ఉంది. ఒకవేళ ఆయన శాంతించకపోతే, ఆయనపై వేటు వేయడం ద్వారా ఇతరులకు గుణపాఠం చెప్పాలని రేవంత్ రెడ్డి వర్గం భావిస్తోంది. రాజగోపాల్ రెడ్డి వైఖరి పార్టీకి బలమా లేక బలహీనతా అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది. సీనియర్ నేతగా ఆయనకున్న బలాన్ని కాపాడుకుంటూనే, ముఖ్యమంత్రి పీఠాన్ని సవాల్ చేసే ధోరణిని అధిష్టానం ఎలా అణచివేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ ఆయన దారికి రాకపోతే, కాంగ్రెస్ తనదైన శైలిలో ఆయనకు దారి చూపించే అవకాశం మెండుగా ఉంది.

## మీర్పేట్ లో మటన్, చికెన్ షాపులపై దాడులు...


# కుళ్లిపోయిన మటన్ సీజ్




**దశ, హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ సర్కిల్లో మీర్ పేట్ నంది హిల్స్ టీచర్స్ కాలనీలో ఉన్న మటన్ మరియు చికెన్ షాపులపై వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ రవిచంద్ర ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా "సైదులు మటన్ & చికెన్ సెంటర్"లో కుళ్లిపోయిన మటన్ను ఫ్రిడ్జ్ లో నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అలాగే సంబంధిత షాప్కు అవసరమైన లైసెన్స్ లేకపోవడంతో ఆ షాప్ ను సీజ్ చేసి కోర్టుకు పంపించారు. ఇతర మటన్, చికెన్ షాపుల్లో కూడా సరైన లైసెన్సులు లేకపోవడం, నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగించడం వంటి ఉల్లంఘనలు బయటపడటంతో జరిమానాలు విధించారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

## సర్పంచ్ పంజా స్వామి



**దౌల్తాబాద్, ఫిబ్రవరి 21:** విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని సర్పంచ్ పంజా స్వామి అన్నారు. శనివారం గాజులపల్లి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. పిల్లలకు పోషకాహారం ఎంతో అవసరమని, నాణ్యమైన ఆహారం అందితే విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. వంటశాల పరిశుభ్రత, భోజన నాణ్యత, పాత్రల శుభ్రత తదితర అంశాలను ఆయన పరిశీలించి, ఎలాంటి లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు త్యాగరాజు, నవీన్ రెడ్డి, నర్సింలు, రజిత, జ్యోతి పాల్గొన్నారు....

# ఏసీబీ వలలో మంథని సబ్ రిజిస్ట్రార్



**దశ, పెద్దపెల్లి:** పెద్దపల్లి జిల్లాలోని మంథనిలో ఓ ప్రభుత్వ అధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. మంథని సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కాసర్ల రాజేందర్, భూమి రిజిస్ట్రేషన్ కోసం లంచం స్వీకరిస్తుండగా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే, ఒక వ్యక్తి కొనుగోలు చేసిన భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్ రిజిస్ట్రార్ రాజేందర్ రూ. 16,500 లంచం డిమాండ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వలపన్నారు. రాజేందర్ సూచన మేరకు, బాధితుడు ఆ డబ్బును రషీద్ అనే ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్‌కు మంథని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇస్తుండగా ఏసీబీ అధికారులు వారిని పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు కీలక సూచన చేశారు. ఏ ప్రభుత్వ అధికారి అయినా లంచం డిమాండ్ చేస్తే, తమ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్, అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా తమను సంప్రదించవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

# మేడారం జాతరను యునెస్కో పరిధిలోకి తేవాలి..

## కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్‌ను కోరిన మంత్రి సీతక్క

**దశ, వరంగల్:**

మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరను ఇంటాంజియబుల్ ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తించేట్టు కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ కృషిచేయాని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క కోరారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ గిరిజన దేవతలు పేరుతో ముద్రించిన పుస్తకాన్ని శుక్రవారం హైదరాబాద్‌లోని జ్యోతిరావుపూలే భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి దనసరి సీతక్క ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాకతీయుల కాలం నాటి రామప్ప దేవాలయాన్ని యునెస్కో గుర్తించేలా ట్రస్ట్ శ్రమించినట్టే ఈ మేడారం జాతర విషయంలో కూడా తగిన ప్రతిపాదనలు రూపొందించాలని కోరారు. మేడారం జాతర ఆసియాలోకెల్లా అతిపెద్ద గిరిజన జాతర అని, ఈ జాతర అనేక ప్రత్యేకతలతో కూడుకున్నదని అన్నారు. యునెస్కో పరిధిలోకి వచ్చేందుకు అవసరమైన అన్ని అర్హతలు ఈ జాతరకు ఉన్నాయన్నారు. వందల సంవత్సరాలుగా గిరిజన సంప్రదాయంతో జరుగుతున్న మేడారం జాతర ఎప్పటికీ చెక్కుచెదరని అపురూపమైన వారసత్వ సంపదగా అభివర్ణించారు. మేడారం జాతరకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృత ప్రచారం కల్పించడంలో విశేషంగా కృషి చేస్తున్న కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్‌ను మంత్రి సీతక్క అభినందించారు. ఈ సందర్భంగా ప్రముఖ చలన చిత్ర దర్శకుడు బి.నర్సింగరావు మేడారం జాతరకు సంబంధించిన అత్యంత అరుదైన ఛాయాచిత్రాలతో, సమగ్ర సమాచారాన్ని జోడించి ఈ పుస్తకాన్ని సంకలనం చేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యులు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బీపీ ఆచార్య, బీవీ పాపారావు, నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండు రంగారావు, కె.శ్రీధర్, రిటైర్డ్ డీజీపీ ఎం.రతన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..
ఆదివారం
22-02-2026
స్టేట్ న్యూస్
WWW.DASHANEWS.COM



# ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఫలితాల నిలుపుదలపై రాష్ట్ర ఎన్నికల సంఘంకు ఫిర్యాదు

**దశ, హైదరాబాద్:** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 17022026న నిర్వహించిన చైర్‌పర్సన్ ఎన్నికల ఫలితాలను అక్రమంగా నిలిపివేశారని ఆరోపిస్తూ భారత్ రాష్ట్ర సమితి పార్టీ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యి, ఎలాంటి స్టే ఆదేశాలు లేకపోయినా ఫలితాలను ప్రకటించకపోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పార్టీ తన ప్రాతినిధ్యంలో పేర్కొంది. బీఆర్ఎస్ రాష్ట్ర శాఖ సమర్పించిన వివరాల ప్రకారం, 16022026న జరగాల్సిన చైర్‌పర్సన్ ఎన్నికల సమావేశం వార్డు నెం.19 సభ్యుడు గైర్హాజరు కావడంతో 17వ తేదీకి వాయిదా పడింది. 1702 2026 ఉదయం 11 గంటలకు జరిగిన సమావేశానికి మొత్తం 15 మంది కౌన్సిలర్లు హాజరై, ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నారు. ఇదే సమయంలో వార్డు నెం.19 సభ్యుడి కుమారుడు హైకోర్టులో హేబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయడంతో తాత్కాలిక ఆదేశం జారీ అయినట్లు సమాచారం వచ్చినప్పటికీ, ఆ ఆదేశం అధికారికంగా తెలియజేయడానికి ముందే సమావేశం ప్రారంభమైందని పేర్కొన్నారు. పార్టీ వాదన ప్రకారం, వార్డు నెం.19 సభ్యుడు స్వయంగా హాజరై ప్రమాణ స్వీకారం చేసి, బీఆర్ఎస్ అభ్యర్థి శ్రీ టేకుల సుధర్శన్ రెడ్డికి మద్దతుగా చేయి ఎత్తి ఓటు వేశారు. మొత్తం 15 మంది సభ్యులు పాల్గొనగా, 15 ఓట్లు బీఆర్ఎస్ అభ్యర్థికే వచ్చినట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికల ప్రక్రియ చట్టబద్ధంగా పూర్తయిందని, అనంతరం మాత్రమే తాత్కాలిక ఆదేశం గురించి సమాచారం అందిందని పేర్కొన్నారు. 18022026న హేబియస్ కార్పస్ పిటిషన్ విచారణకు వచ్చిన సందర్భంగా గౌరవ హైకోర్టు తాత్కాలిక ఆదేశాన్ని రద్దు చేసినట్లు పార్టీ తెలిపింది. ప్రస్తుతం ఎలాంటి స్టే లేకపోయినా, రిటర్నింగ్ అధికారి ఫలితాలను ప్రకటించకుండా నిలిపివేయడం చట్టవిరుద్ధమని ఆరోపించింది. తెలంగాణ మున్సిపాలిటీల చట్టం, 2019 ప్రకారం కోరం లేకపోతే మాత్రమే సమావేశం వాయిదా వేయవచ్చని, ఈ సందర్భంలో కోరం పూర్తిగా ఉండి ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఫలితాలను నిలిపివేయడానికి అధికారికి అధికారం లేదని స్పష్టం చేసింది. ఇకపై కూడా ఆలస్యం జరిగితే రాజ్యాంగపరమైన చట్టపరమైన మార్గాలను అనుసరిస్తామని బీఆర్ఎస్ హెచ్చరించింది. ఎన్నికైన అభ్యర్థిని తక్షణమే చైర్‌పర్సన్‌గా ప్రకటించి, వైస్‌చైర్‌పర్సన్ ఎన్నికల తేదీని నిర్ణయించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరింది. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో చోటుచేసుకున్న ఈ పరిణామాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## మంత్రి పొన్నం ను కలిసిన జిల్లా ఉద్యమకారులు



**దశ, హైదరాబాద్:** తెలంగాణ ఉద్యమకారుల అంశానికి రాజ్యసభలో ఆమోదం లభించిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర జిల్లా ఉద్యమకారులు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇదే సందర్భంలో ఉద్యమకారుల జేఏసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంను కూడా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారుల పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని, ఉద్యమ సమయంలో చేసిన త్యాగాలు, పోరాటాలే రాష్ట్ర సాధనకు పునాది అయ్యాయని పేర్కొన్నారు. ఉద్యమకారుల అంశానికి రాజ్యసభ ఆమోదం లభించడం రాష్ట్ర ఉద్యమ చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టమని ఆయన అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు, ప్రొఫెసర్ కోదండరాంకు పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఉద్యమకారుల హక్కులు, గుర్తింపు కోసం భవిష్యత్తులోనూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఓరుగంటి ఆనంద్, జెనిగె విష్ణువర్ధన్, కారింగుల నరేందర్ గౌడ్, కొంతం యాదిరెడ్డి, నక్క జంగయ్య గౌడ్, జోర్క రాము ముదిరాజ్, జానకి రెడ్డి, మాదాసు శ్రీనివాస్‌తో పాటు పెద్ద సంఖ్యలో తెలంగాణ ఉద్యమకారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పరిషత్‌లు రద్దు దిశగా అడుగులు




**మొదటి పేజీ తరువాయి**

ఈ వ్యవస్థల వల్ల జరుగుతున్న లాభనష్టాలు, రద్దు చేస్తే కలిగే పరిణామాలు , ఇతర రాష్ట్రాల్లోని పరిస్థితులను పొందుపరచనున్నారు. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు వేగంగా తీసుకుంటున్నా చట్టపరంగా, రాజ్యాంగపరంగా ఈ నిర్ణయం అమలు చేయడం అంత సులభం కాదని తెలుస్తోంది. దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థ అనేది 73వ రాజ్యాంగ సవరణ ద్వారా దేశవ్యాప్తంగా ఒకే తీరుగా అమలులోకి వచ్చింది. రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం, రాష్ట్రాలు తమ ఇష్టానుసారం మూడు అంచెల వ్యవస్థలో మార్పులు చేయడం సాధ్యం కాదు. ఎంపీటీసీ, జడ్పీటీసీలను రద్దు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం ద్వారా రాజ్యాంగ సవరణ తప్పనిసరి అని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నివేదిక ఆధారంగా, ఈ ప్రతిపాదన చట్టపరంగా, రాజకీయంగా ఎంత వరకు సాధ్యమవుతుందనే దానిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. కేవలం రాష్ట్ర స్థాయిలో ఒక తీర్మానం చేయడం ద్వారా లేదా ఆర్డినెన్స్ తీసుకురావడం ద్వారా ఈ వ్యవస్థను రద్దు చేయడం కుదరదని ఒక వేళ కేంద్రం సహకరించకపోతే ఇది న్యాయపరమైన చిక్కులకు దారి తీస్తుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు ఈ వ్యవస్థలో సర్పంచులకు గ్రామంలో నిధులు, విధులు ఉంటాయి. కానీ ఎంపీటీసీలకు, జెడ్పీటీసీలకు ప్రత్యేకంగా నిధులు గానీ, కార్యాలయాల్లో కనీసం కూర్చునేందుకు సీటు గానీ ఉండటం లేదనే అసంతృప్తి ఉంది. ఒకే గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీ మధ్య తరచూ ఘర్షణ వాతావరణం నెలకొంటోంది. అధికారాల విభజనలో స్పష్టత లేకపోవడం అభివృద్ధికి ఆటంకంగా మారుతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు ఓటు హక్కు ఉంది, కానీ సర్పంచులకు లేదు. వ్యవస్థను రద్దు చేయడం ద్వారా ఈ అసమానతలను తొలగించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. అయితే.. ఈ నిర్ణయం అమలు చేయడం అంత సులభం కాదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ వ్యవస్థలు 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా ఏర్పడ్డాయి. వీటిని రద్దు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో చట్టసవరణ చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం కేవలం విన్నపం మాత్రమే చేయగలదు. రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో ఉన్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవులను రద్దు చేస్తే, పార్టీ క్యాడర్‌లో అసంతృప్తి జ్వాలలు ఎగిసే అవకాశం ఉంది. రాజకీయంగా ఎదిగేందుకు అవకాశం ఉన్న ఈ మెట్లను తొలగిస్తే రాజకీయ నిరుద్యోగం పెరుగుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది. ఇప్పుడు అదే పార్టీ అధికారంలో ఉండి ఆ వ్యవస్థలోని భాగాలను రద్దు చేస్తే దేశవ్యాప్తంగా తప్పుడు సంకేతాలు వెళ్తాయనే వాదన కూడా పార్టీలో వినిపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా జెడ్పీటీసీగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి నేడు ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు. కాబట్టి ఆయన ఈ వ్యవస్థ ప్రాముఖ్యతను గుర్తిస్తారా లేదా పాలనా సౌలభ్యం కోసం రద్దు వైపు మొగ్గు చూపుతారా అనేది వేచి చూడాలి.

ఫిబ్రవరి 23న జరగబోయే కేబినెట్ భేటీలో ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఒకవేళ ప్రభుత్వం ఈ నిర్ణయానికే కట్టుబడితే, ఇది తెలంగాణ రాజకీయాల్లో ఒక పెను మార్పుగా నిలుస్తుంది.

## జర్నలిస్టు మహేష్‌ను పరామర్శించిన దౌల్తాబాద్ జర్నలిస్టులు



**దౌల్తాబాద్:** మిరుదొడ్డి మండలంలోని లింగుపల్లి గ్రామానికి చెందిన జర్నలిస్టు కిచ్చని మహేష్ తండ్రి గంగయ్య ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల దౌల్తాబాద్ మండల జర్నలిస్టులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో శనివారం దౌల్తాబాద్ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గొల్లపల్లి నగేష్, గౌరవ అధ్యక్షులు సంతోష్,ఉపాధ్యక్షులు కావేటి బాబు,సభ్యులు అజయ్, డప్పు శ్రీనివాస్, బొల్లం రాజేష్ తదితరులు కలిసి జర్నలిస్టు మహేష్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మహేష్ కుటుంబాన్ని పరామర్శించి, ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేస్తూ, ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. ప్రమాదంలో తండ్రిని కోల్పోవడం కుటుంబానికి తీరని లోటు అని పేర్కొంటూ, మహేష్‌కు జర్నలిస్టుల సంఘం తరపున అండగా ఉంటామని తెలిపారు.

## ఆళ్లపల్లి అడవుల్లో పెద్దపులి!

**ఆళ్లపల్లి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి అడవుల్లో పెద్దపులి అడుగుజాడలు కలకలం రేపాయి. లక్ష్మీపురం శివారులో పనికి వెళ్తున్న రైతులు పులి అడుగులను గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం చేరవేశారు. ఆళ్లపల్లి ఫారెస్ట్ రేంజర్ కిరణ్‌కుమార్ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయికి వెళ్లి పులి అడుగులను గుర్తించారు. పెద్దపులి రేగళ్ల రేంజ్ నుంచి ఆళ్లపల్లి రేంజ్‌లోకి ప్రవేశించిందని, రేంజ్ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## సిద్దిపేట జిల్లా సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడిగా కొన్యాల బాల్ రెడ్డి ఏకగ్రీవం...



**దశ,గజ్వేల్:** సిద్దిపేట జిల్లాలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా ములుగు మండలం క్షీరసాగరం గ్రామ సర్పంచ్ కొన్యాల బాల్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే గజ్వేల్ నియోజకవర్గ సర్పంచ్ ఫోరం అధ్యక్షుడిగా దిలాల్‌పూర్ గ్రామ సర్పంచ్ వెంకట్ రెడ్డి ఎన్నికయ్యారు.గజ్వేల్‌లో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన అధ్యక్షులను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సౌధాని భూమన్న యాదవ్ మాట్లాడుతూ, సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం, నిధులు మరియు విధుల సంరక్షణ కోసం రాజకీయాలకు అతీతంగా సంఘం పనిచేస్తుందని తెలిపారు. 1995 సంవత్సరం నుంచి ఉమ్మడి రాష్ట్ర కాలం నుండి నేటి వరకు సంఘం అనేక సమస్యలపై స్పందిస్తూ సర్పంచ్‌లకు అండగా నిలిచిందని పేర్కొన్నారు.అనంతరం జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బాల్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు క్రమశిక్షణతో పనిచేస్తూ సర్పంచ్‌ల సంక్షేమం మరియు సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, గజ్వేల్ మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు అశోక్ రెడ్డి, కౌన్సిలర్లు నరసింహారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, గూగులోత్ రమేష్,నాయిని యాదగిరి, నక్కరాములు గౌడ్, గుంటుకు శ్రీనివాస్, నాయకులు సుఖేందర్ రెడ్డి, నాగరాజు నేత, డప్పు గణేష్ తదితరులు పాల్గొన్నారు...

## ప్రకాశం బజార్లో పారిశుధ్య పనులపై ప్రత్యేక పరిశీలన.



**దశ, నల్గొండ:** నగరంలోని ప్రముఖ వాణిజ్య కేంద్రం ప్రకాశం బజార్‌లో కొనసాగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర ప్రత్యక్షంగా పరిశీలించారు. బజార్ పరిసరాల్లో చెత్త తొలగింపు, డ్రైనేజీ శుభ్రపరిచే పనులు, రోడ్ల స్వచ్ఛతపై అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ శరత్ చంద్ర మాట్లాడుతూ, వాణిజ్య ప్రాంతాల్లో పారిశుధ్య ప్రమాణాలు కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. రోజువారీ చెత్త సేకరణ సమయానికి జరగాలని, వ్యాపారులు కూడా స్వచ్ఛతలో భాగస్వాములు కావాలని సూచించారు. డ్రైనేజీ మూసుకుపోకుండా తరచూ శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని సంబంధిత విభాగ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బజార్ ప్రాంతంలో పేరుకుపోయిన వ్యర్థాలను తక్షణమే తొలగించి, శానిటేషన్ సిబ్బంది హాజరు, పనితీరుపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ కొనసాగించాలని కమిషనర్ స్పష్టం చేశారు. నగరంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ, ప్రజల సహకారంతో నల్గొండను శుభ్రమైన నగరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

## గ్రామాల్లో వార్డు సభ్యులు పారదర్శకంగా విధులు నిర్వహించాలి



**దౌల్తాబాద్:** గ్రామాల్లో సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు అందేలా వార్డు సభ్యులు కృషి చేయాలని ఎంపీడీవో సయ్యద్ గఫూర్ ఖాద్రి సూచించారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని దొమ్మాట రైతు వేదికలో ఐదు రోజులుగా 13 గ్రామపంచాయతీల వార్డు సభ్యులకు నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారం విజయవంతంగా ముగిశాయి. గ్రామపంచాయతీ పాలన, గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. శిక్షణలో గ్రామ అభివృద్ధి ప్రణాళికల తయారీ, పారిశుధ్య నిర్వహణ, త్రాగునీటి సరఫరా, పన్నుల వసూలు, ప్రజల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై సంబంధిత శాఖల అధికారులు వార్డు సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. ప్రజలతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా విధులు నిర్వహించాలని, గ్రామాల్లో సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని సమర్థవంతంగా పరిష్కరించేలా పని చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు. శిక్షణ ముగింపు సందర్భంగా వార్డు సభ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నర్సింలు,ట్రైనర్లు రవీందర్ రెడ్డి, గౌస్, వినోద్ కుమార్, అర్షద్, పంచాయతీ కార్యదర్శులు బిక్షపతి, విమల, శ్వేత, మనోజ్, శ్రీమాన్ రెడ్డి, సునీత, అనిల్, హంసకేతన్, విద్యాసాగర్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు..

## ఫూలే ఓవర్సీస్ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

**హైదరాబాద్:** మహాత్మా జ్యోతిబాపూలే ఓవర్సీస్ విద్యానిధి పథకానికి సంబంధించి ఈ ఏడాది అర్హులైన బీసీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నెల 23 నుంచి మార్చి 24 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పేర్కొంది.ఈ పథకం ద్వారా లబ్దిదారుల సంఖ్యను సంవత్సరానికి 300 నుంచి 700 పెంచినట్టు అధికారులు పేర్కొన్నారు. ఇందులో 500 మంది బీసీలకు, 200 మంది ఈబీసీలకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. స్ప్రింగ్ అండ్ ఫాల్ సెషన్‌కు 250 మంది బీసీలకు, 100 మంది ఈబీసీలకు చొప్పున కేటాయించామని పేర్కొన్నారు. విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే బీసీ, ఈబీసీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.